# 2023




## 10

## పని ప్రదేశాల్లో భద్రత

**ప్రతి ముగ్గురిలో** ఒక మహిళ తన జీవితకాలంలో ఏదో ఓ సందర్భంలో లైంగిక హింసను ఎదుర్కొంటుంది. షీస్ బర్డీ సంస్థ ఆ సవాలుకు జవాబు వెదికింది. ఈ కంపెనీ కీ చెయిన్ పరిమాణంలో వ్యక్తిగత భద్రత అలారం జోడించిన బర్డీ ప్లస్‌ను రూపొందించింది. దీనికి ఓ చిన్నపాటి బటన్ ఉంటుంది. నొక్కితే చాలు సైరన్ మోగుతుంది. అలా విపత్కర పరిస్థితుల్లో సాయం అందుకోవచ్చు.



## 12

## జబర్దస్త్ జాకెట్

**వర్షాకాలంలో** జాగింగ్‌కో, ఆఫీసుకో బయల్దేరుతున్నప్పుడు.. చినుకులబారిన పడకుండా ఉండటానికి రెయిన్ కోట్ (జాకెట్) ఓ పరిష్కారం. అయితే, వీటివల్ల గాలి ఆడదు. విపరీతంగా చెమట పడుతుంది. ఈ ఇబ్బందిని నివారించడానికి స్పోర్ట్స్ యాక్సెసరీస్ సంస్థ నైకి ఓ కొత్త తరహా జాకెట్‌ను అందుబాటులోకి తెచ్చింది. వానలో, జాగింగ్ సమయంలో శరీరం చెమట పట్టగానే దీనిలోని చిన్నచిన్న వెంట్స్ వెంటనే గుర్తిస్తాయి. వాటంతట అవే తెరుచుకుంటాయి. శరీరం చల్లబడగానే మూసుకుపోతాయి. జాకెట్ ఫ్యాబ్రిక్‌లో మీ ఒంటి తేమకు అనుగుణంగా ప్రతిస్పందించే ఫిల్మ్ ఉండటమే దీనికి కారణం. మన శరీరం పరిసరాలకు అనుగుణంగా ఉష్ణోగ్రతను బ్యాలెన్స్ చేసుకున్నట్టుగానే ఇదీ వ్యవహరిస్తుంది. ప్రస్తుతం స్త్రీల కోసం ఈ జాకెట్లు మార్కెట్‌లోకి వచ్చాయి. త్వరలోనే పురుషుల వేరియంట్లు కూడా దొరుకుతాయి.



## 11

## సుస్థిరమైన పాదరక్షలు

**జెలర్‌ఫీల్డ్** ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈవో), సహ వ్యవస్థాపకుడు కార్నీలియస్ స్మిత్‌కు భారీ లక్ష్యాలే ఉన్నాయి. వాటిలో 'భూమ్మీద ప్రతి ఒక్కరికీ పూర్తిగా రీసైకిల్ చేయగలిగే 3డీ ప్రింటెడ్ షూస్ అందించాలి' అనేది ఒకటి. కొనుగోలుదారులు తమ పాదం సైజును స్మార్ట్‌ఫోన్‌తో స్కాన్ చేసి జెలర్‌ఫీల్డ్ సంస్థకు పంపితే చాలు. దీని ఆధారంగా మన పాదాల సైజును బేరీజు వేసి.. షూస్ తయారు చేసిస్తారు. ప్రస్తుతం వీరిదగ్గర 200 3డీ ప్రింటర్స్ ఉన్నాయి. ఈ షూస్ థర్మోప్లాస్టిక్ పాలియూర్‌థేన్ అనే మెటీరియల్‌తో తయారవుతాయి. దీని రీసైక్లింగ్ సులువు. మన అవసరం తీరిపోయాక ఆ పాత షూస్‌ను జెలర్‌ఫీల్డ్‌కు తిరిగి పంపించాలి. వాటిని మళ్లీ కొత్తవాటిగా రూపొందిస్తారు.